క్లుప్తంగా

కరపత్రాల ఆవిష్కరణ



వర్ధన్నపేట : ఈ నెల 30న నిర్వహించే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేస్తున్న మతోన్మాద బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలను వ్యతిరేకించాలని ఇతర రాజకీయ పార్టీలను నిలదీయాలని టీపీఎఫ్టీపీ జాక్ నాయకులు ప్రజలను కోరారు. శనివారం పట్టణ కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్లో ఆయా సంఘాల నాయకులు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా ఫ్రంట్ రాష్ట్ర నాయకురాలు బి.రమాదేవి, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు మాట్లాడుతూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి మార్గం చూపకుండా జనాకర్షక పథకాలతో ప్రజల ఓట్లు పొందాలని ప్రధాన పార్టీలు చూస్తున్నాయన్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమిస్తున్న ప్రజా సంఘాల నాయకులు, మేధావులపై కేసీఆర్ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టిందని విమర్శించారు. కార్యక్రమంలో జాక్ నాయకులు పులి అరుణ, యాకర సోమయ్య, సాగర్, సంజీవ కృష్ణ, అక్బర్, శ్యాం భాస్కర్, లక్ష్మణ్ రాజు, రాంబాబు, రఘు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

చెన్నారావుపేట : మండలంలోని గొల్లపల్లికి చెందిన మేకల సాంబయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులను మండల యువ నాయకుడు కంది కృష్ణ చైతన్యరెడ్డి పరామర్శించి, 50 కిలోల బియ్యం అందించారు. సర్పంచ్ బానోత్ రమేశ్, ఎంపీటీసీ ధరావత్ శ్రీను, విజేందర్, ధరావత్ భరత్, నాయకులు రమేశ్, సురేష్, తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



రాయపర్తి : అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మండలకేంద్రానికి చెందిన ఖాజాపాషా, వలబోజు రామ్మూర్తిని బీఆర్ఎస్ మండల ఎన్నికల ఇన్చార్జ్ గుడిపూడి గోపాల్రావు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, జెడ్పీటీసీ రంగు కుమార్గౌడ్, ఆకుల సురేందర్రావు, అక్బర్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలి

మామునూరు: శాంతియుత వాతావరణంలో ఓటర్లు ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవడమే కేంద్ర సాయుధ బలగాలు, స్థానిక పోలీసుల ధ్యేయమని ఇన్స్పెక్టర్ క్రాంతికుమార్ అన్నారు. ఎన్నికల నేపథ్యంలో మామునూరు ఏసీపీ సతీష్ ఆదేశాల మేరకు సమస్యాత్మక గ్రామాలైన అల్లీపురం, తిమ్మాపురం, మామునూరు గ్రామాల్లో ఎస్సైలు కృష్ణవేణి, ప్రమోద్ ఆధ్వర్యంలో స్పెషల్ పోలీసులు శనివారం కవాతు నిర్వహించి, శాంతిభద్రతలపై అవగాహన కల్పించారు.

పనితీరు చూసి పట్టం కట్టండి



వర్ధన్నపేట: ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్



ఏనుమాములలో నమూనా ఈవీఎంతో ప్రచారం చేస్తున్న మహిళలు

- బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేశ్
- చుట్టపు చూపుగా వచ్చే పార్టీలను, నాయకులను విశ్వసించొద్దు

వర్ధన్నపేట : ప్రజల తలలో నాలుక లాగా మెదిలే తన పనితీరును చూసి ప్రజలు మూడోసారి పట్టం కట్టాలని వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేశ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం వర్ధన్నపేట మున్సిపాలిటీ పరిధిలోని నీలగిరిస్వామి తండా, డీసీ తండా, గుబ్బేటి తండా, కోనాపురంతో పాటు పట్టణ కేంద్రంలో రమేశ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అరూరి మాట్లాడుతూ.. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అసత్య ప్రచారాలు చేసిన ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. నియోజకవర్గ కేంద్రాన్ని మున్సిపాలిటీ చేసి గతంలో ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి కేసీఆర్, మున్సిపల్ మంత్రి కేటీఆర్ల సహకారంతో రూ.231.8 కోట్ల ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు గుర్తుచేశారు. వర్ధన్నపేట నియోజకవర్గ ఓటరు తల ఎత్తుకునే విధంగా తాను పనులు చేశానని.. తలవంపులు తీసుకువచ్చే తప్పుడు పనులు చేయలేదని స్పష్టం చేశారు. కష్టపడి పనిచేసి ఈ స్థాయికి వచ్చానని, తన తండ్రి అరూరి గట్టుమల్లు పేరుతో ఫౌండేషన్ స్థాపించి నిరుపేదలైన విద్యార్థులకు ఉపాధి కల్పన కోసం కృషిచేస్తున్నానని చెప్పారు. కేవలం ఎన్నికలప్పుడే చుట్టపు చూపుగా వచ్చి పోయే పార్టీలను, నాయకులను ప్రజలు విశ్వసించకూడదన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్రావు, జిల్లా రైతు బంధు కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాయాదవ్, రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ ఆంగోత్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

అరూరితోనే అభివృద్ధి: రిటైర్డ్ ఏసీపీ ఉదయ్కిరణ్



పర్వతగిరి: సమావేశంలో మాట్లాడుతున్న అంబాల ఉదయ్కిరణ్

పర్వతగిరి : వర్ధన్నపేట నియోజకవర్గంలో ఎమ్మెల్యే అరూరి రమేశ్తోనే అభివృద్ధి సాధ్యమైందని రిటైర్డ్ ఏసీపీ అంబాల ఉదయ్కిరణ్ అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని అరూరి రమేశ్ క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రమేశ్ కమీషన్ల కోసం పని చేయలేదని, ప్రజలకు సేవ చేసేందుకు పని చేశాడన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నిలిపాడన్నారు. ముచ్చటగా మూడోసారి ప్రజలు అరూరి రమేశ్కు మద్దతు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, తద్వారా అరూరికి మంత్రి అవడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కే.ఆర్ నాగరాజు పోలీసు అధికారిగా సేవలందించి నప్పటికి వర్ధన్నపేట ప్రజలతో మమేకం కాలేకపోయారన్నారు. బీఆర్ఎస్ ఎన్నికల ఇన్చార్జ్ బాబురావు, పీఏసీఎస్ చైర్మన్లు మోటపోతుల మనోజ్గౌడ్, గొర్రె దేవేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రంగు కుమార్గౌడ్, వైస్ ఎంపీపీ ఎర్రబెల్లి రాజేశ్వర్రావు, మాజీ జెడ్పీటీసీలు మేడిశెట్టి రాములు, పంతులు, సర్పంచ్ వెంకన్న, బీఆర్ఎస్ నాయకులు వెంకట్రాజ్యం, శ్యాం పాల్గొన్నారు.

అరూరికి ఆటో డ్రైవర్స్ యూనియన్ మద్దతు



మడికొండ: రమేశ్కు మద్దతు తెలుపుతున్న ఆటోడ్రైవర్స్ యూనియన్ నాయకులు

మడికొండ : బీఆర్ఎస్ వర్ధన్నపేట అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేశ్కు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు మడికొండ ఆటో యూనియన్ నాయకులు శనివారం ప్రకటించారు. కార్యక్రమంలో ధర్మసాగర్ పీఏసీఎస్ చైర్మన్ గుండ్రెడ్డి రాజేశ్వర్ రెడ్డి, 46, 64వ డివిజన్ల కార్పొరేటర్లు మునిగాల సరోజన, ఆవాల రాధికారెడ్డి, డివిజన్ల అధ్యక్షులు బొల్లికొండ వినోద్, దువ్వ శ్రీకాంత్, మడికొండ ఆటో యూనియన్ నాయకులు రాజు, పల్లపు రాజ్ కుమార్, వస్కుల రమేశ్, బరిగల కృష్ణమూర్తి, శివరాత్రి తిరుపతి, అరూరి బాబు, మహ్మద్ సలీం, జిట్ట సదానందం, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్కు గౌడ సంఘం మద్దతు

కరీమాబాద్ : బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలుపుతున్నట్లు ఉర్సు కరీమాబాద్ గీత పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ మండ వెంకన్నగౌడ్ చెప్పారు. కరీమాబాద్లో గీత కార్మికుల సమక్షంలో బీఆర్ఎస్కు అండగా ఉంటామని గౌడ సంఘం నాయకులు శనివారం ప్రకటించారు. కార్యక్రమంలో నాగపురి సంజయ్బాబు, బత్తిని హరి, నాగపురి వెంకటేశ్వర్లు, మండ శ్యామ్, బత్తిని రాజు, నాగపురి కుమారస్వామి, బలరాం, అశోక్, పడిశాల వెంకన్న, పొగాకు సందీప్, విజయ్, గీత కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మామునూరులో బీఆర్ఎస్ ప్రచారం

అరూరి రమేశ్ను గెలిపించాలని కోరుతూ గ్రేటర్ పరిధిలోని 43వ డివిజన్ మామునూరులో ఆ పార్టీ నాయకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటు వేసి రమేశ్ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఈదురు అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి అంబాల ఉదయ్కిరణ్, మాజీ సర్పంచ్ కుమారస్వామి, యూత్ నాయకుడు వంశీతోపాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏనుమాములలో నమూనా ఈవీఎం బ్యాలెట్తో ప్రచారం

దేశాయిపేట : అరూరి రమేశ్ గెలుపునకు వర్ధన్నపేట పరిధిలోని 14వ డివిజన్ ఏనుమాముల గ్రామంలో రైతు సమితి జిల్లా అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్ ఆధ్వర్యంలో శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నమూనా ఈవీఎం బ్యాలెట్ ద్వారా ఓటు ఎలా వేయాలో ఓటర్లకు అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో డివిజన్ మహిళా అధ్యక్షురాలు నాగనబోయిన మాధవి, సోరం కల్యాణ్, నాయకులు రాజమౌళి, సుధాకర్, పెనుకుల సాంబయ్య, ఏలియా, ఐలయ్య, కుమారస్వామి, మరియ, రాంచందర్, రాజు, అశోక్, విజయ, రాధ పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత కాంగ్రెస్ అడ్రస్ ఉండదు

హసన్పర్తి : ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నాగరాజు అడ్రస్ ఉండదని బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హసన్పర్తి, చింతగట్టు, సుబ్బయ్యపల్లి, ఎల్లాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ దివ్యారాణి, డివిజన్ అధ్యక్షుడు పావుశెట్టి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ రాజునాయక్, ఆత్మ చైర్మన్ చంద్రమోహన్, మార్కెట్ డైరెక్టర్ వీసం సురేందర్రెడ్డి, చకిలం రాజేశ్వర్రావు, నాగరాజు, వల్లాల శ్రీకాంత్, సాయికమార్, రఘోత్తంరెడ్డి, సాగర్, మల్లేశం, శ్రీనివాస్, కృష్ణమూర్తి, అర్జున్, గిన్నారపు రవీందర్, జన్ను కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఎఫ్లో మాక్ పోలింగ్



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న విద్యార్థులు



మాక్ పోలింగ్లో పాల్గొన్న టీచర్లు, విద్యార్థులు

నెక్కొండ : మండలంలోని రెడ్లవాడలో గల రూరల్ డెవలప్మెంట్ ఫౌండేషన్(ఆర్డీఎఫ్) పాఠశాలలో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ మేరకు విద్యార్థులకు ఎన్నికల నిర్వహణ, ఓటు విలువను తెలియజేయడమే లక్ష్యంగా మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్. చేరాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రజా ప్రతినిధులను ఎన్నికలో నిర్వరించే విధులు, బాధ్యతలపై విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు మాక్ పోలింగ్లో పాల్గొని ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కు రాజ్యాంగం మనకు ఇచ్చిన ఒక వజ్రాయుధమని విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ ఆర్. బాబురావు, ఇన్చార్జ్లు నాగేష్, బి. విజేందర్, పీఈటీ జాటోత్ నాగేశ్వర్, విద్యార్థులు తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినులు శుభ్రత పాటించాలి

చెన్నారావుపేట : విద్యార్థినులు వ్యక్తిగత శుభ్రత పాటించాలని జయముఖి కళాశాల ఫార్మ్-డీ విద్యార్థులు వివరించారు. ఈ మేరకు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో శనివారం జాతీయ ఫార్మసీ వారోత్సవాల సందర్భంగా జయముఖి కళాశాల జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) విభాగం ఆధ్వర్యంలో రుతుస్రావం -పరిశుభ్రత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో విద్యార్థినులు మాట్లాడుతూ.. రుతుస్రావం అనేది ఒక సహజ సిద్ధమైన శరీర లక్షణం. ఈ విషయంపై ఆడపిల్లలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో, తీసుకోవాల్సిన ఆహార నియమాలను వివరించారు. శానిటరీ ప్యాడ్స్ వాడడం వల్ల కలిగే ప్రయోజనాలు, హ్యాండ్ వాషింగ్ ప్రాముఖ్యత, పరిశుభ్రత పాటించే విషయాలను తెలిపారు. ఆడపిల్లలు వారి తల్లిదండ్రులతో, ఉపాధ్యాయినులతో భయపడకుండా, సిగ్గుపడకుండా భావ వ్యక్తీకరణ చేయాలని తెలిపారు. జంకు పదార్థాలు తినడం వల్ల హార్మోనుల అసమతుల్యత జరిగి సమస్య తీవ్రం అయ్యే అవకాశం ఉందని సూచించారు. ఈ సదస్సులో ఎన్ఎస్ఎస్ పీఓ అశ్విన్కుమార్, ఉపాధ్యాయినులు రాజ్యలక్ష్మి, సుజాత, అధ్యాపకులు, విద్యార్థినులు తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్లో పలువురి చేరిక



దుగ్గొండి: బీఆర్ఎస్లో చేరిన యువకులతో పెద్ది సుదర్శన్రెడ్డి

దుగ్గొండి : మండలంలోని పీజీతండాకు చెందిన పలువురు యువకులు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్లో చేరారు. లావుడ్యా చంద్రశేఖర్, రాజు, శ్రీకాంత్, వస్రాం, రాజేందర్, శంకర్, రంజిత్, సునావత్ శంకర్, శ్రీనివాస్లకు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. క్లస్టర్ ఇన్చార్జ్ కాట్ల భద్రయ్య, సర్పంచ్ సునావత్ మంగమ్మ, రమేశ్ నాయక్, లావుడ్యా శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్ది సుదర్శన్ రెడ్డికి దివ్యాంగుల మద్దతు



ఖానాపురం: మద్దతు తెలుపుతున్న దివ్యాంగులు

ఖానాపురం : దివ్యాంగులమంతా బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పెద్ది సుదర్శన్రెడ్డికే మద్దతు తెలుపుతున్నామని దివ్యాంగ సంఘం జిల్లా అధ్యక్షుడు నూకల కృష్ణమూర్తి అన్నారు.ఈ మేరకు మండలంలోని పలు గ్రామాల్లో పెద్ది గెలుపు కోసం శనివారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో దివ్యాంగులు సంతోషంగా జీవించారన్నారు. సంఘం బాధ్యులు దొనికెల రాములు, కొండేటి ప్రభాకర్, శంకర్,రవి పాల్గొన్నారు.

క్షేత్ర పర్యటనకు తరలిన విద్యార్థులు



క్షేత్ర పర్యటనకు తరలి వెళ్తున్న విద్యార్థులు

నర్సంపేట : పట్టణానికి చెందిన సిద్ధార్థ డిగ్రీ, పీజీ కళాశాల వృక్షశాస్త్ర, జంతుశాస్త్ర విభాగాల విద్యార్థులు శనివారం క్షేత్ర పర్యటనకు గంగారం అభయారణ్యానికి తరలి వెళ్లారు. ఈ కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ గోగుల ప్రభాకర్రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ప్రభాకర్రెడ్డి మాట్లాడుతూ పర్యటనలో అనేక విషయాలు శోధన ద్వారా తెలుసుకుని రావాలని విద్యార్థులకు సూచించారు. వృక్షశాస్త్రం విభాగం అధ్యాపకుడు అశోక్ అభయారణ్యంలోని ఔషధ మొక్కలు వాటి రకాలు, ఉపయోగాలు, గుణ గణాలను విద్యార్థులకు వివరించారు. జంతుశాస్త్ర విభాగం అధ్యాపకుడు మహేష్ గంగారం అభయారణ్యంలో నివసించే అరుదైన జంతు జాతులు, వాటి ఆవాసం, వేసవి కాలంలో నీటి వసతుల కల్పనా విధానం, వన్య ప్రాణుల రక్షణ సంబంధ చర్యల గురించి వివరించారు. ఈ క్షేత్ర పర్యటన విద్యార్థులకు ఎంతో విజ్ఞానాన్ని పెంపొందించిందని, విద్యార్థులు స్వయంగా పరిశీలించి అభ్యసన తీరుని మెరుగు పర్చుకోవడానికి దోహం అయిందని పర్యటన నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

చిందు కళాకారుల ప్రచారం



దొంతి గెలుపునకు ప్రచారం చేస్తున్న కళాకారులు

నెక్కొండ : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గెలుపు కోసం అభ్యర్థులు వినూత్న రీతిలో ప్రచారాలు చేస్తున్నారు. శనివారం కాంగ్రెస్ నర్సంపేట ఎమ్మెల్యే అభ్యర్థి దొంతి మాధవరెడ్డి గెలుపునకు చిందు కళాకారులు ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ నెక్కొండ క్లస్టర్ ఇన్చార్జ్ పెండ్యాల హరిప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని ప్రచారం నిర్వహించారు. చిందు కళాకారుల వేషధారణ పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి శివకుమార్, నాయకులు రమేష్, ప్రశాంత్, భానుప్రకాష్, విజేందర్, ఐలయ్య, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణం



గూడ్స్ ట్రాలీ టాప్పై కూర్చొని వెళ్తున్న మహిళ

- పొంచి ఉన్న ప్రమాదం..

నర్సంపేట రూరల్ : పరిమితికి మించి కూలీలను తరలిస్తున్నారు... ఏదైనా జరగరానిది జరిగితే ఏంటి పరిస్థితి అనేది ఆలోచించరు..వారికి కావాల్సిందల్లా అదనపు ఆదాయం.. దీంతో ప్రయాణికులకు రక్షణ లేకుండా పోతోంది.. అధికారులు సైతం దృష్టి సారించడం లేదు.. కూలీల అవసరాన్ని ఆసరా చేసుకొని ఆటో డ్రైవర్లు పరిమితికి మించి కూలీలను ఆటోలో తీసుకెళ్తున్నారు.. కనీసం కూర్చోవడానికి స్థలం లేకపోవడంతో వాహనాల టాప్పైన కూర్చుండ బెట్టుకోని తరలిస్తున్నారు.. గ్రూడ్ ట్రాలీలో ఎక్కువ మంది పడితే ఆటో డ్రైవర్లకు ఎక్కువ డబ్బులు వస్తాయని కక్కుర్తి పడుతున్నారు. ప్యాసింజర్ ఆటో 8మంది సిట్టింగ్ వరకే పరిమితం ఉంటే 15 నుంచి 20మంది వరకు కూర్చుండ బెట్టుకోని తీసుకెళ్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితేనే అధికారులు హడావుడి చేస్తున్నారే తప్పా.. ప్రమాదం జరుగుతుందని, ముందస్తు పరిమితికి మించి ఆటోలో కూలీలను తీసుకెళ్తే చర్యలు తీసుకోవాలనే ఆలోచనే అధికారులకు లేకుండాపోయిందని పలువురు వాపోతున్నారు. ఏది ఏమైనప్పటికీ ఆటో డ్రైవర్లకు పోలీసులు, ఆర్టీఏ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చి సీట్ల పరిమితి వరకే కూలీలకు తీసుకెళ్లాలని, పరిమితికి మించి తీసుకెళ్లిన ఆటో డ్రైవర్లపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు విమర్శిస్తున్నారు.

మోసపూరిత మాటలను తిప్పికొట్టాలి



సంగెం: ఆశాలపల్లిలో ఎడ్లబండిపై ప్రచారం చేస్తున్న చల్లా ధర్మారెడ్డి



సంగెం: కాపులకనిపర్తిలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ధర్మారెడ్డి

- ప్రతిపక్షాలు మోకాలడ్డుపెట్టినా 'రైతుబంధు' ఆగదు
- బీఆర్ఎస్ పరకాల అభ్యర్థి ధర్మారెడ్డి

సంగెం : ఆరు గ్యారంటీ పతకాలంటూ ఊర్లకు వస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకుల మోసపూరిత మాటలను ప్రజలు తిప్పికొట్టాలని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని అడ్డంకులు సృష్టించినా వాటిని అధిగమించి యాసంగి పెట్టుబడి సాయం రైతుబంధు పథకం అన్నదాతల ఖాతాల్లోకి జమ కానున్నాయని స్పష్టం చేశారు. శనివారం మండలంలోని గుంటూరుపల్లి, కాపులకనిపర్తి, ఆశాలపల్లి, రామచంద్రాపురం, వెంకటాపూర్, కాట్రపల్లి, గవిచర్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్, పరకాల నియోజకవర్గాన్ని నేను అన్ని రంగాల్లో అభివృద్ధి చేశాం. అరవై ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి, సంక్షేమం ఏం చేయలేదు. ఇప్పుడు ఒక్క చాన్స్ అంటూ బోగస్ మాటలు చెప్పుకుంటూ ఊళ్లలోకి వస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ చెబుతున్న గ్యారంటీలకు వారంటీ లేదు. పార్టీల నాయకులను గ్రామాల్లోకి రాకుండా తరిమి కొట్టండి' అని వ్యాఖ్యానించారు. రామచంద్రాపురంలో రూ.53. కోట్లతో అభివృద్ధి చేశామని, కళ్లముందు కన్పిస్తోందన్నారు. మూడోసారి ముఖ్యమంత్రి ప్రమాణస్వీకారం చేయగానే సౌభాగ్యలక్ష్మి పథకం ద్వారా అత్తకు రూ. 5వేలు, కోడలకు రూ. 3వేలు అందిస్తామన్నారు. పట్టణాల కంటే పల్లెలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయన్నారు. మండలానికి దేశంలోనే అతిపెద్ద టెక్స్టైల్ పార్కును తీసుకువచ్చామని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రకటించిన కేసీఆర్ భరోసా మేనిఫెస్టోలో పొందుపరిచిన అంశాలు ప్రజలకు దోహదపడుతాయన్నారు.

వెలమ సంఘం ఏకగ్రీవ తీర్మానం

మండలంలోని కాపులకనిపర్తి గ్రామ వెలమ సంఘం నాయకులు, 50 కటుంబాలు బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. అధ్యక్షుడు దుగ్యాల గోపాల్రావు, కార్యదర్శి పోలాల గోపాల్ రావు, సభ్యులు దేవేందర్రావు ప్రకటించారు.

బీఆర్ఎస్లో చేరిక

మండలంలోని పల్లారుగూడ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం బీఆర్ఎస్లో చేరారు. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి ఆహ్వానించారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి



పరకాల : చల్లా జ్యోతికి బొట్టు పెడుతున్న మహిళ

పరకాల : పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన అభివృద్ధిని చూసి ఓటేయాలని బీఆర్ఎస్ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డి సతీమణి చల్లా జ్యోతి కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 9, 21 వార్డుల్లో మున్సిపల్ చైర్పర్సన్ సోదా అనిత రామకృష్ణతో కలిసి శనివారం ప్రచారం నిర్వహించారు. మోడల్ ఈవీఎంలో కారు గుర్తును చూపుతూ ఓటు అభ్యర్థించారు. స్థానిక మహిళ ఓటర్లు బొట్టుపెట్టి ఆహ్వానించారు. అదే విధంగా 1, 10, 13 వార్డు కౌన్సిలర్లు మడికొండ సంపత్, పసుల లావణ్య, రజని ప్రచారం చేపట్టారు.

బీఆర్ఎస్ ఇంటింటా ప్రచారం

ఆత్మకూరు: బీఆర్ఎస్ పార్టీ పరకాల ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డిని గెలిపించాలని మండలంలోని నీరుకుళ్లలో విద్యార్థి విభాగం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్షం మధుకర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. కారు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

గీసుకొండ: గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లకు చెందిన పలువురు యూత్ కాంగ్రెస్ కార్యకర్తలు శనివారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి బీఆర్ఎస్ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

మార్కెట్పై అవగాహన పెంచుకోవాలి



కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఇనుగాల జోగిరెడ్డి, జయపాల్రెడ్డి, ఇందిర

మామునూరు: పంట సాగు విధానం, విక్రయాలు, మార్కెట్ పనితీరుపై విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని టీఎస్ఎస్పీ రిటైర్డ్ పోలీసు అధికారుల వెల్ఫేర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి ఇనుగాల జోగిరెడ్డి సూచించారు. ఈమేరకు ఖిలా వరంగల్ మండలం తిమ్మాపురం పెన్షన్పురంలోని పారామౌంట్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ఆవరణలో ప్రిన్సిపాల్ విజయపాల్ రెడ్డి, ఇందిర ఆధ్వర్యంలో మోడల్ విజిటేరియన్ మార్కెట్ను శనివారం ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాజీ సర్పంచ్ పోశాల సదానందంతో కలిసి కూరగాయల మార్కెట్ను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జమీల్, షకీల్, షేక్ అలీ, రాముతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ను గెలిపించాలి



రాయపర్తి : పాలకుర్తి నియోజకవర్గంలో సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ అభ్యర్థి మామిండ్ల రమేష్రాజా కోరారు. శనివారం మండలంలోని కొలన్పల్లి, బురహాన్పల్లి, కొండూరు, కాట్రపల్లి, రాయపర్తి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధిని చేయని ఎర్రబెల్లి దయాకర్రావును ఓడించాలని కోరారు. తనను గెలిపిస్తే సామాజిక న్యాయాన్ని అమలు చేస్తానని హామీ ఇచ్చారు. సామాన్యులకు విద్యా, వైద్యం అందుబాటులోకి తెస్తానన్నారు. మూడు నక్షత్రాల గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జీడి సోమయ్య, నజీర్, యాకన్న, సురేష్, మహేందర్, గణేష్, సోమన్న పాల్గొన్నారు.